సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా


గురువారం । 11 । మే । 2023



గంజాయి స్వాధీనం

IIలో

గంజాయి తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులను పట్టుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు **తరలించామని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.**



విరగ్గాసిన ద్రాక్ష

IIలో

అరకులోయ మండలం బస్కి పంచాయతీ గాయిబంద గ్రామంలో గిరి రైతుల కిల్లో బుద్ధు ఇంటి పెరట్లో ద్రాక్ష పాదు విరగ్గాసింది.

నాణ్యమైన సేవలే లక్ష్యం



ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో విలేకరులతో మాట్లాడారు.

IIలో

న్యూస్‌రీల్

ప్రశాంతంగా పాలిసెట్

జిల్లావ్యాప్తంగా 1918 మంది హాజరు



పాడేరు కేంద్రంలో పాలిసెట్ పరీక్షను తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా 15 పరీక్ష కేంద్రాల్లో పాలిసెట్–2023 బుధవారం ప్రశాంతంగా జరిగింది. పాడేరులోని ఎనిమిది పరీక్షా కేంద్రాలతో పాటు చింతూరు, ఏటపాక, రంపచోడవరం పరిధిలోని నాలుగు కేంద్రాల్లో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించారు. 3140 మంది విద్యార్థులు పాలిసెట్‌కు హాల్ టికెట్లు పొందగా 1918 మంది పరీక్షకు హాజరయ్యారు. 57.9 శాతం మంది పరీక్ష రాయగా 1322 మంది విద్యార్థులు పాలిసెట్‌కు హాజరు కాలేదు. జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ పాడేరులోని ఎనిమిది పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

విధుల పట్ల నిర్లక్ష్యం తగదు

డీఎంహెచ్‌వో జమాల్‌బాషా



జి.మాడుగుల పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా

జి.మాడుగుల: విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని, వైద్యులు, సిబ్బంది రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారులు, వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీహెచ్‌సీలో ప్రసవాల వివరాలను ఆయన తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు శశికాంత్, రవిచంద్రశేఖర్, ఎంపీహెచ్‌ఈవో ప్రకాష్, హెచ్‌వీ బి.రత్నం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు

సాక్షి, పాడేరు: వేసవి సెలవులు కావడంతో విద్యార్థులకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను జిల్లా కేంద్రమైన పాడేరులో బుధవారం ప్రారంభమయ్యాయి. ఏపీ ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ చేతుల మీదుగా విద్యార్థులకు విలువిద్యతో పాటు పలు క్రీడలకు సంబంధించి శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ శిక్షణ శిబిరాలను విద్యార్థులంతా వినియోగించుకోవాలని, క్రీడల్లో కూడా రాణించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జగన్మోహనరావు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పి.సూరిబాబు, పలు పాఠశాలల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

గ్రామస్తుల ఫిర్యాదు మేరకు భూసర్వే



గ్రామస్తుల నుంచి వివరాలు సేకరిస్తున్న డీఐవోఎస్ కృష్ణమోహన్

అనంతగిరి: మండలంలోని భీంపోలు పంచాయతీ చిముడుపల్లి గ్రామ గిరిజనుల ఫిర్యాదు చేయడంతో పాడేరు డీఐఓఎస్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది బుధవారం సర్వే చేపట్టారు. భూస్వాముల నుంచి రక్షణ కల్పించాలని ఇటీవల జెడ్పీటీసీ గంగరాజుతో కలిసి గ్రామస్తులు పాడేరులో జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు డీఐవోఎస్ కృష్ణమోహన్ చిమిడిపల్లి గ్రామానికి చేరుకొని గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. రెవెన్యూ సిబ్బందితో కలిసి సర్వే నిర్వహించారు. నివేదికను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పారు. ఎంపీటీసీ సభ్యుడు అశోక్, టోకూరు సర్పంచ్ మొస్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పరవళ్లు

- నేడు కీలక ప్రాజెక్టులను ప్రారంభించనున్న సీఎం జగన్
- క్రికెట్ స్టేడియం ఆవరణలో వైఎస్సార్ విగ్రహావిష్కరణ
- అపోలో క్యాన్సర్ యూనిట్ ప్రారంభం
- సీ హారియర్, స్పోర్ట్స్ ఎరీనా ప్రజలకు అంకితం
- భీమిలి ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు, ఎండాడలో కాపుభవన్‌కు శంకుస్థాపన

దొండపర్తి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ పర్యటన అభివృద్ధికి సాక్ష్యంగా నిలవనుంది. పర్యాటక మణిమకుటం సీ హారియర్ మ్యూజియం, క్రీడా వైభవానికి సాక్ష్యంగా నిలవనున్న ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాను ఆయన ప్రజలకు అంకితం చేయనున్నారు. మత్స్యకారుల కలల కేంద్రం ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు అంకురార్పణ జరగనుంది. వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ–వీడీసీఏ అంతర్జాతీయ స్టేడియం ప్రాంగణంలో మహానేత వైఎస్సార్ విగ్రహం ఆవిష్కరణ, అపోలో ఆస్పత్రిలో క్యాన్సర్ యూనిట్ ప్రారంభం, కాపు సంక్షేమ భవన్‌కు శంకుస్థాపన తదితర కార్యక్రమాలు సీఎం జగన్ చేతులమీదుగా జరగనున్నాయి.



ముఖ్యమంత్రి జగన్ చేతుల మీదుగా ఆవిష్కరణకు సిద్ధమైన వైఎస్సార్ విగ్రహం

స్టేడియంలో వైఎస్సార్ విగ్రహం

విశాఖ స్పోర్ట్స్: పీఎంపాలెంలోని డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియం ప్రవేశద్వారం వద్ద ఏర్పాటు చేసిన వైఎస్సార్ నిలువెత్తు విగ్రహాన్ని సీఎం జగన్ ఆవిష్కరించనున్నారు. ఈ విగ్రహం నిర్మాణానికి ఏసీఏ అపెక్స్ కౌన్సిల్‌తో పాటు జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. విగ్రహం దూరం నుంచి ఆకట్టుకునే విధంగా రూపొందించారు. ముందుగా అనుకున్న బేస్‌మెంట్‌ను కాస్త పెంచారు. విగ్రహం బరువుకు అనుగుణంగా బేస్‌ను 90 డిగ్రీల నుంచి 45 డిగ్రీల యాంగిల్‌కు మార్చి ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు.

సీఎం పర్యటన ఇలా..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ **మోహన్‌రెడ్డి గురువారం** మధ్యాహ్నం **2 గంటలకు తా**డేపల్లి నివాసం **నుంచి బయలుదేరి** 3.20 గంటలకు **విశాఖ విమానాశ్రయా**నికి చేరుకుంటారు. **అక్కడి నుంచి** నేరుగా 3.50కి పీఎంపాలెంలోని **వైఎస్ రాజ**శేఖరరెడ్డి ఏసీఏ–వీడీసీఏ **అంతర్జాతీయ క్రికెట్** స్టేడియానికి చేరుకుంటారు. **అక్కడ ఏర్పాటు చేసిన** మహానేత వైఎస్ రాజశేఖ**రరెడ్డి విగ్రహాన్ని ఆ**విష్కరిస్తారు. స్టేడియంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నిర్వహించే ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం 4.50 గంటలకు ఆరిలోవలోని అపోలో ఆస్పత్రికి చేరుకుంటారు. అక్కడ అపోలో క్యాన్సర్ యూనిట్‌ను ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా ఫొటో సెషన్‌లో పాల్గొని.. రేడియేషన్ పరికరాల కేంద్రాన్ని సందర్శిస్తారు. అనంతరం ముఖ్యమంత్రి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. అక్కడి నుంచి 5.50 గంటలకు బీచ్‌రోడ్డుకు చేరుకుని రూ.7.5 కోట్లతో నిర్మించిన సీ–హారియర్ మ్యూజియం, ఎంవీపీకాలనీలో రూ.25.5 కోట్లతో నిర్మించిన జీవీఎంసీ ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనా, రామ్‌నగర్‌లో రూ.12 కోట్లతో నిర్మించిన వాణిజ్య సముదాయాన్ని ప్రారంభిస్తారు. అనంతరం భీమిలిలో రూ.24.86 కోట్లతో నిర్మించనున్న ఫిష్ ల్యాండింగ్ సెంటర్, ఎండాడలో కాపు భవన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 6.15 గంటలకు బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాలులో పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కుమారుడి వివాహానికి హాజరవుతారు. సాయంత్రం 7 గంటలకు తిరుగు పయనమై రాత్రి 8.20కి తాడేపల్లిలోని నివాసానికి చేరుకుంటారు.

రూ.24.86 కోట్లతో ఫిష్ ల్యాండింగ్ సెంటర్

భీమిలి తీరగ్రామాల మత్స్యకారుల కల నెరవేరనుంది. ఆరు ఎకరాల విస్తీర్ణంలో రూ.24.86 కోట్ల వ్యయంతో ఫిష్‌ల్యాండింగ్ సెంటర్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేయనున్నారు. దీని ద్వారా భీమిలిలో తోటవీధి, బోయవీధి, ఎగువపేట, నాగమయ్యపాలెం, మరికొన్ని ప్రాంతాల మత్స్యకారులకు ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం భీమిలిలో 141 మోటరైజ్డ్ బోట్లు, 109 నాన్‌మోటరైజ్డ్ బోట్లలో మత్స్యకారులు వేట చేస్తున్నారు. ఈ ప్రాంతంలో 1,524 మంది మత్స్యవేటపైనే జీవనం సాగిస్తున్నారు. ప్రతి ఏటా 403.16 మెట్రిక్ టన్నుల మత్స్య సంపద వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో ఇక్కడ ఫిష్ ల్యాండింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం ద్వారా 250 బోట్లకు సేఫ్ పార్కింగ్, వేలం హాలు, నెట్ మెండింగ్ సెంటర్, కమ్యూనిటీ హాల్, 2 ఫిష్ డ్రైయింగ్ ప్లాట్‌ఫాంలు, ట్రక్ పార్కింగ్, గ్రామం నుంచి ల్యాండింగ్ సెంటర్ వరకు సిమెంట్ రోడ్లు, గొడౌన్లు, ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఇలా అనేక సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.

రూ.25.5 కోట్లతో స్పోర్ట్స్ ఎరీనా

అన్ని రంగాల్లోనూ అంతర్జాతీయ హంగులు సంతరించుకుంటున్న విశాఖ.. క్రీడారంగంలోనూ తిరుగులేని నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందులో భాగంగా ఎంవీపీకాలనీ సెక్టార్–8లో ఏఎస్ కాలేజీ గ్రౌండ్‌కు అనుకుని ఉన్న వీఎంఆర్‌డీఏకు చెందిన 1.27 ఎకరాల స్థలంలో రూ.25.5 కోట్లతో జీవీఎంసీ ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాను నిర్మించింది. బేస్‌మెంట్‌తో పాటు గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్‌తో నిర్మించిన ఈ స్టేడియంలో అనేక సౌకర్యాలు కల్పించారు. 2107 చ.మీ విస్తీర్ణంలో బేస్‌మెంట్ ఏరియా, 1449 చ.మీ విస్తీర్ణంలో నిర్మించిన గ్రౌండ్‌ఫ్లోర్‌లో అత్యాధునిక బ్యాడ్మింటన్ కోర్టుతో పాటు వాలీబాల్, బాస్కెట్‌బాల్ కోర్టులను అభివృద్ధి చేశారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని రకాల పరికరాలు ఇక్కడ ఉంచనున్నారు.

స్టేడియంలో సౌకర్యాలు : ఇండోర్ బాస్కెట్ బాల్ కోర్టు–1, ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టులు–6, ఇండోర్ వాలీబాల్ కోర్టు–1, స్విమ్మింగ్ పూల్, కిడ్స్ పూల్, అవుట్‌డోర్ జిమ్, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, సింథటిక్ అండ్ వుడెన్ ఫ్లోరింగ్, వాల్ క్లాడింగ్, స్పోర్ట్స్ ఫిజియోథెరపీ, యోగా సెంటర్, జిమ్, బోర్డ్ గేమ్స్, చేజింగ్ రూమ్స్, లాకర్స్, జాగింగ్ ట్రాక్, 294 సీటింగ్ సామర్థ్యం



రూ.7.5 కోట్లతో సీ హారియర్ మ్యూజియం

బీచ్‌రోడ్డులో మరో పర్యాటక కేంద్రం ప్రారంభానికి సిద్ధమైంది. ఇప్పటికే సబ్‌మెరైన్, టీయూ–142 యుద్ధ విమానం పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. తాజాగా ఏర్పాటు చేసిన సీ హారియర్ మ్యూజియం మరో పర్యాటక మణిహారంగా మారనుంది. రూ.7.5కోట్లతో ఈ మ్యూజియాన్ని వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేసింది. 1983లో బ్రిటిష్ ఏరోస్పేస్ నుంచి కొనుగోలు చేసిన ఈ సీ–హారియర్ యుద్ధ విమానం.. నౌకాదళం ఏవియేషన్ విభాగంలో చేరింది. గోవాలోని ఐఎన్‌ఎస్ హంస యుద్ధ నౌకలో 32 ఏళ్ల పాటు దేశానికి సేవలందించింది. 2016లో సేవల నుంచి నిష్క్రమించింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం చొరవతో వీఎంఆర్‌డీఏ ఈ యుద్ధ విమానాన్ని సాగరతీరంలో మ్యూజియంగా తీర్చిదిద్దింది. హైడ్రాలిక్ క్రేన్ సహాయంతో జీ ప్లస్ టూ బిల్డింగ్‌లో సీహారియర్‌ను వేలాడదీశారు. ఇందులో ఏర్పాటు చేసిన సిమ్యులేటర్ ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. అలాగే నావికాదళానికి, ఎయిర్‌క్రాఫ్ట్‌కు సంబంధించి విశేషాలతో కూడిన చిత్రాలను ప్రదర్శించనున్నారు. ఈ మ్యూజియాన్ని సీఎం జగన్ గురువారం సాయంత్రం 5.50 గంటలకు ప్రారంభించనున్నారు. ఇక్కడి నుంచే జీవీఎంసీ ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాను కూడా ప్రారంభిస్తారు.



పారదర్శకంగా సేవలందించాలి

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



సచివాలయం సమస్యలు తెలుసుకుంటున్న అరకు ఎమ్మెల్యే పాల్గుణ

అరకులోయ రూరల్: పారదర్శకంగా ప్రజలకు సేవలు అందించాలని ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సూచించారు. పెదలబుడు సచివాలయం–2ను బుధవారం ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సందర్శించారు. సచివాలయ సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వివరాలు తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు రిజిస్టర్, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ అంకితభావంతో ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. విధి నిర్వహణలో ఏఒక్కరు కూడా నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. ,గ్రామ స్థాయిలో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వాటి పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం గ్రామ వలంటీర్లతో సమావేశమయ్యారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. విధి నిర్వహణలో ఇష్టంతో పనిచేస్తే ప్రత్యేక గుర్తింపు వస్తుందన్నారు, గ్రామ వలంటీర్ల సేవలు మరువలేనివన్నారు. భవిష్యత్తులో మంచి రోజులు వస్తాయన్నారు. ఎంపీపీ ఉషారాణి, మండల కన్వీనర్ పట్టాసి సంపత్‌కుమార్, వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి పెట్టేలి సుంద్ర, సీనియర్ నాయకులు ముఖి సాంబ, రమేష్, నర్సింగ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు పరిశీలన



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో

అనంతగిరి: మండలంలో జెడ్పీ సీఈవో శ్రీరామూర్తి బుధవారం పర్యటించారు. జెడ్పీ నిధులతో చేపట్టిన వివిధ పనులను ఆయన పరిశీలించారు. అనంతగిరిలోని అంగన్‌వాడీ కేంద్రం, రచ్చబండ, జాకరవలసలో సీసీ రోడ్డు పనులు పరిశీలించారు.వివిధ సచివాలయలను సందర్శించి ప్రభుత్వ సేవలపై సచివాలయ సిబ్బంది నుంచి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోదమ్మ ఉత్సవాలకు పటిష్ట భద్రత

- 1400 మంది సిబ్బందితో బందోబస్తు
- సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా
- కేటాయించిన ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్
- విజయవంతానికి అందరి సహకారం
- పాడేరు ఏఎస్పీ ధీరాజ్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏఎస్పీ ధీరాజ్ తదితరులు

పాడేరు రూరల్: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, గిరిజనుల ఇలవేల్పు పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలను అన్నివర్గాల ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని పాడేరు ఏఎస్పీ ధీరాజ్ కోరారు. ఉత్సవ ఏర్పాట్లకు సంబంధించి బుధవారం పాడేరులోని సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 14,15,16 తేదీల్లో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో 1400 మంది పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా పాడేరు పట్టణ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్టు ఆయన వెల్లడించారు. ఉత్సవాల సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా దారి మళ్లిస్తున్నట్టు చెప్పారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించి సహకరించాలని కోరారు. ముంచంగిపుట్టు, పెదబయలు మార్గం నుంచి వచ్చే వాహనాలు, అరకు, డుంబ్రిగుడ, అనంతగిరి, హుకుంపేట మార్గాల నుంచి వచ్చే వాహనాలను తలారిసింగి పాఠశాల, కుమ్మరిపుట్టు పరిసర ప్రాంతాల్లో పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. ఆయా ప్రాంతాలకు వంతాడపల్లి చెక్‌పోస్ట్ మీదుగా తుంపాడ వైపు వెళ్లాల్సి ఉంటుందన్నారు. చోడవరం వైపు నుంచి వచ్చే వాహనాలు మండల పరిషత్ కార్యాలయం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిసర ప్రాంతాల్లో పార్కింగ్ చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. చింతపల్లి, జి.మాడుగుల ప్రాంతం నుంచి వచ్చే వాహనాలను సెయింటాన్స్ పాఠశాల పరిసర ప్రాంతాల్లో పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. ఈ విషయంలో ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. జాతరలో దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రతిఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో పాడేరు సీఐ సుధాకర్, ఎస్ఐలు లక్ష్మణ్, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

ఈదురుగాలులతో వర్షం

ఇంటిపై కూలిన చెట్టు



గిరిగొయ్యిపాలెంలో ఇంటిపై కూలిన చెట్టు

జి.మాడుగుల: మండలంలో పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో వర్షం కురిసింది. గెమ్మెలి పంచాయతీ గిరిగొయ్యిపాలెంలో సర్పంచ్ సీదరి కొండబాబు రేకుల ఇంటిపై చెట్టు పడటంతో దెబ్బతింది. సుమారు రూ.20 వేల ఆస్తి నష్టం వాటిల్లింది. వర్షానికి రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.

హుకుంపేట: మండలంలో బుధవారం పలు చోట్ల ఈదురుగాలులతో వర్షం కురిసింది. మండల కేంద్రంలో మోదకొండమ్మతల్లి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసి కటౌట్ విరిగి పడింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

కీచక టీచర్ల ఆటకట్టు

- ఐదుగురి ఉపాధ్యాయులపై పోక్సో కేసు
- కలెక్టర్ ఆదేశాల మేరకు అదుపులోకి తీసుకున్న పోలీసులు



రాజవొమ్మంగి: విద్యార్థినులపై ఐదుగురు టీచర్లు లైంగిక వేధింపులకు పాల్పడటం స్థానికంగా సంచలనం కలిగించింది. విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులు బరితెగించి విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో వారిపై పోక్సో కేసు నమోదైంది. విద్యార్థినులు రెండు నెలలుగా వేధింపులకు గురవుతున్నట్టు అధికారుల విచారణలో వెలుగు చూసింది. టెన్త్ పరీక్షల గడువు నెల రోజులు ఉండగా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు మొదలు పెట్టారు. వేధింపులకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న గుమ్మిడి నాగరాజు సైన్స్, మఠం శాంతిబాబు సోషల్, జీడెం సత్యనారాయణ హిందీ, పల్లాల గోపాలరావు ఫిజికల్ సైన్సు సబ్జెక్టులను బోధిస్తున్నారు. రెగ్యులర్ తరగతులతో పాటు, ప్రత్యేక తరగతుల్లోను వేధింపులకు పాల్పడటంతో విద్యార్థినులు మానసిక వేదనకు గురయ్యారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉపాధ్యాయులపై తక్షణ చర్యలు చేపట్టారు. ఆయన ఆదేశాల మేరకు డీఈవో ఐదుగురిని సస్పెండ్ చేశారు. వారిపై పోక్సో కేసు నమోదైంది.

విద్యార్థినులకు బెదిరింపులు

పాఠశాల విద్యార్థినులు తమపై ఫిర్యాదు చేశారన్న విషయం తెలుసుకున్న ఐదుగురు ఉపాధ్యాయులు వారి ఇళ్లకు వెళ్లారు. ఇచ్చిన ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని విద్యార్థినుల తల్లిదండ్రులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన ఐదుగురు ఉపాధ్యాయులను అదుపులోకి తీసుకోవాలని పోలీసులకు ఆదేశాలిచ్చారు. విద్యాప్రమాణాల పరంగా ప్రత్యేక గుర్తింపు ఉన్న ఈ పాఠశాలలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం విస్మయానికి గురి చేస్తోంది.

రబీ వరికి వరుణ కటాక్షం

- మేలు చేస్తున్న అకాల వర్షాలు
- గింజ దశలో పైరు
- మంచి దిగుబడి వచ్చే అవకాశం
- ఆనందంలో గిరి రైతు

సాక్షి,పాడేరు: జిల్లాలో రబీ వరి పైరు పొట్టదశలో కళకళలాడుతోంది. అకాల వర్షాలు మేలు చేయడంతో గిరి రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. జిల్లాలోని 22 మండలాల పరిధిలో నీటి సౌకర్యం అందుబాటులో ఉన్న చోట 2700 హెక్టార్లలో రబీ వరి సాగు చేపట్టారు. రైతులంతా తమ వద్ద ఉన్న సంప్రదాయ వరి విత్తనాలతో నీటి నిల్వలు అధికంగా ఉన్న లోతట్టు భూముల్లో నారుమడులు ముందస్తుగా వేసుకున్నారు. సీజన్ ప్రారంభం నుంచి వాతావరణం అనుకూలంగా ఉండటంతో ఆరోగ్యకరంగా ఎదిగాయి. రైతులు ముందస్తుగానే నాట్లు వేయగలిగారు. వరినాట్లు పూర్తయిన తరువాత వాతావరణ పరిస్థితులతో పాటు వర్షాలు విస్తారంగా కురవడంతో పైరు ఎదుగుదలకు దోహదం చేసింది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా రబీలో వరిపంట గింజ దశలో కంకులతో కళకళలాడుతోంది.

మండలాలవారీగా..

జిల్లా వ్యాప్తంగా 22మండలాల్లో 2700 హెక్టార్లలో నాట్లు వేశారు. ముంచంగిపుట్టు మండలంలో 174 హెక్టార్లు, పెదబయలు 242, డుంబ్రిగుడ 149, అరకులోయ 83, అనంతగిరి 91, హుకుంపేట 83, పాడేరు 202, జి.మాడుగుల 171, చింతపల్లి 54, జి.కె.వీధి 59, కొయ్యూరు 84, దేవీపట్నం 410, అడ్డతీగల 134, రాజవొమ్మంగి 61, గంగవరం 220, రంపచోడవరం 53, కూనవరం134 హెక్టార్లలో సాగు చేపట్టారు.



కందమామిడి ప్రాంతంలో రబీ వరి పైరు

ఎకరాకు 35 బస్తాలు..

రబీకి సంబంధించి వరి దిగుబడుల్లో వేర్వేరు ప్రాంతాల్లో హెచ్చుతగ్గులు ఉంటున్నాయి. రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలో 1121, ఆర్ఎన్ఆర్ 15408, తెలంగాణ సోనా వరి రకాలను రైతులు సాగు చేస్తున్నారు. పంట కాలం 135 నుంచి 140 రోజులు కాగా ఎకరాకు 80 కిలోల చొప్పున 35 బస్తాల వరకు దిగుబడి వస్తోందని వారు చెబుతున్నారు.



అధిక కంకులతో వరి పంట

పాడేరులో 'సంప్రదాయ' విత్తనాలు

పాడేరు డివిజన్‌లో మాత్రం గిరిజన రైతులు తమ సొంతంగా భద్రపరచుకున్న సంప్రదాయ విత్తనాలను రబీకి వినియోగిస్తున్నారు. 140 రోజుల కాలపరిమితి లోగా పంట పక్వానికి వస్తుందని వారు తెలిపారు. సంప్రదాయ విత్తనాలను వినియోగించిన చోట ఎకరాకు 25 బస్తాలు వరకు ధాన్యం దిగుబడి వస్తుందని వారు పేర్కొంటున్నారు.

ఎదుగుదల బాగుంది



రబీ వరి పైరు ఎదుగుదల బాగుంది. పుష్కలంగా నీరు అందుబాటులో ఉన్నందున ప్రస్తుతం పొట్టదశలో ఉంది. వాతావరణం అనుకూలంగా ఉన్నందున దిగుబడి బాగుంటుందని ఆశిస్తు న్నాను. గతేడాది ఎకరాకు 23 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చింది. ఈ ఏడాది పెరిగే అవకాశం ఉంది.

–వి.సన్యాసినాయుడు, రైతు, మత్స్యపురం, హుకుంపేట మండలం

అకాల వర్షాలతో మేలు



ఈఏడాది ఏప్రిల్ మొదటి వారం నుంచి వర్షాలు భారీగా కురవడంతో వరి పంటకు మేలు చేశాయి. పైరు ఆశాజనకంగా ఉండటంతో ఈ నెలాఖరుకు కోతలు మొదలయ్యే పరిస్థితి ఉంది. వ్యవసాయశాఖ సలహాలు, సూచనల మేరకు వరి కోతలు మొదలు పెట్టాలి.

– ఎస్‌బీఎస్ నందు, జిల్లా వ్యవసాయాధికారి, పాడేరు

క్లుప్తంగా

విరగ్గాసిన ద్రాక్ష



పాదులకు ద్రాక్ష గుత్తులు

అరకులోయ రూరల్: మండలంలోని బస్కి పంచాయతీ పరిధి గాయిబంద గ్రామంలో గిరి రైతుల కిల్లో బుద్ధు ఇంటి పెరట్లో ద్రాక్ష పాదు విరగ్గాసింది. గతేడాది 30 కిలోల ద్రాక్ష పండ్ల దిగుబడి వచ్చిందని, ఈఏడాది మరింత దిగుబడి పెరిగిందని రైతు తెలిపాడు. ద్రాక్ష కాయలతో నిండుగా ఉన్న పాదును స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

కంచరపాలెం(విశాఖ ఉత్తర): పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు స్థానిక ప్రభుత్వ బాలికల పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రాంగణంలోని జాతీయ కెరియర్ సర్వీస్ సెంటర్ ఫర్ ఎస్సీ, ఎస్టీ ఆధ్వర్యంలో స్టైఫండ్‌తో కూడిన ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు సబ్ రీజనల్ ఉపాధి కార్యాలయం అధికారి శ్యాంసుందర్ నిట్టాల ఒక ప్రకటనలో తెలిపారు. 18–27 ఏళ్ల మధ్య వయస్సు ఉండి, ఇంటర్ ఆపైన కోర్సులు చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. ఈ ఏడాది పరీక్షలకు హాజరైన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఎంపికైన వారికి నెలకు రూ.1000 స్టైఫండ్‌తో పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. దరఖాస్తుదారుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3లక్షలకు మించరాదన్నారు. ఈ నెల 15వ తేదీలోగా నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్ పోర్టల్ https://ncs.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

హెచ్‌సీఎల్ టెక్‌బీ జాబ్ డ్రైవ్ రేపు

మురళీనగర్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌సీఎల్ ఈ నెల 12న టెక్‌బీ జాబ్ డ్రైవ్ నిర్వహిస్తుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికృష్ణ చైతన్య తెలిపారు. నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీలో హెచ్‌సీఎల్ టెక్‌బీ ప్రవేశాలకు ఇంటర్వ్యూలు ఉంటాయని చెప్పారు. 2022 లేదా 2023 సంవత్సరంలో ఇంటర్మీడియట్ పూర్తి చేసి కనీసం 60% మార్కులతో ఉత్తీర్ణులైన యువతీయువకులు ఈ జాబ్ డ్రైవ్‌కి అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 12న ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 98484 38254ను సంప్రదించాలని సూచించారు.

బంగారం కోసం మహిళ దారుణ హత్య

- స్నేహంగా మెలిగి ఆటో డ్రైవర్ ఘాతుకం
- మిస్సింగ్ కేసులో కాల్‌డేటా ఆధారంగా దర్యాప్తు



రీసు గోపి (ఫైల్)



నిందితుడు రాజు

కొమ్మాది(భీమిలి): బంగారం కోసం ఓ మహిళను ఆటో డ్రైవర్ దారుణ హత్య చేసిన సంఘటన భీమిలిలో సంచలనం రేపింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తగరపువలస బాలాజీనగర్‌కు చెందిన రీసు గోపి(30) అనే యువతికి పదేళ్ల కిందట విజయనగరానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. కుటుంబ కలహాల కారణంగా ఆమె భర్తతో విడిపోయింది. అప్పటి నుంచి గోపి తన అక్క రీసు రాము వద్ద ఉంటోంది. ఇదిలా ఉండగా మూడేళ్ల క్రితం జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడ పరిధి పాతూరుకు చెందిన ఆటో డ్రైవర్ మైలిపల్లి రాజుతో గోపికి పరిచయం ఏర్పడింది. ఇది స్నేహంగా మారి అప్పుడప్పుడు కలుసుకుంటుండేవారు. ఈ క్రమంలో ఈ నెల 1న తన మేనమామ కుమార్తె పెళ్లి చూపులుకు అలంకరణ కోసం బంగారు వస్తువులు(10 తులాలు) తీసుకుని చిప్పాడకు వెళ్లాలని రాజుకు ఫోన్ చేసి తగరపువలస రావాలని గోపి చెప్పింది. అదే రోజు సాయంత్రం పెళ్లి చూపులు ముగించుకుని తిరిగి తన ఇంటి వద్ద విడిచిపెట్టాలని కోరింది. అయితే అలా బయటకు వెళ్దామని రాజు కోరగా.. ఆమె సరే అంది. దీంతో ఇద్దరూ కాపులుప్పాడ గంభీరం గెడ్డ వద్దకు చేరుకున్నారు. తనకు అప్పులు ఉన్నాయని, అవి తీర్చేందుకు బంగారం కావాలని గోపిని రాజు అడిగాడు. ఇందుకు ఆమె అంగీకరించకపోవడంతో ఆటోలో ఉన్న తాడును గోపి మెడకు చుట్టి హత్య చేసి అదే గెడ్డలో పడేసి, 10 తులాల బంగారాన్ని తీసుకుని పారిపోయాడు.

మిస్సింగ్ కేసుతో దర్యాప్తు

ఈ నెల 1న చిప్పాడ వెళ్లిన తన చెల్లి తిరిగి రాకపోవడంతో ఆమె అక్క రీసు రాము 2వ తేదీన భీమిలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఆచూకీ కోసం గాలించిన పోలీసులకు ఎటువంటి సమాచారం లేకపోవడంతో కాల్‌డేటా ఆధారంగా ఈ కేసును ఛేదించారు. గోపి చివరిగా ఫోన్‌లో మాట్లాడింది రాజుతోనే అని తెలుసుకున్న పోలీసులు నిఘా పెంచారు. ఈ క్రమంలో రాజు మొబైల్ సిగ్నల్ ఆధారంగా బీచ్ రోడ్డు మంగమారిపేటలో ఉన్నట్టు గుర్తించారు. పోలీసులు, గోపి బంధువులు మంగళవారం రాత్రి రాజును పట్టుకునేందుకు మంగమారిపేట చేరుకున్నారు. ఇది తెలుసుకున్న రాజు అక్కడి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించినప్పటికీ పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తమదైన రీతిలో విచారించగా.. తనకు అప్పులు ఉన్నాయని, బంగారం కావాలని గోపిని అడిగానని, ఆమె నిరాకరించడంతో కోపంతో హత్య చేసి గెడ్డలో పడేసినట్టు నేరాన్ని ఒప్పుకున్నాడు. గెడ్డలో పడి ఉన్న గోపి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. భీమిలి సీఐ కె.లక్ష్మణమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని గోపి కుటుంబ సభ్యులు పోలీసులను కోరారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ లక్ష్మణమూర్తి

ఎన్టీఆర్ వైద్యాలయంలో సైకో వీరంగం

భయభ్రాంతులకు గురైన రోగులు



వైద్యాలయంలో సైకోను బంధించిన ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది



అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు సైకోను తరలిస్తున్న పోలీసులు

అనకాపల్లి టౌన్: అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో బుధవారం తెల్లవారు జామున సైకో వీరంగం సృష్టించాడు. వైద్యాలయం సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్ అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం రాత్రి సుమారు ఒంటిగంట సమయంలో అనకాపల్లి రైల్వే స్టేషన్ నుంచి గుర్తు తెలియని వ్యక్తి ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వ్యక్తికి కాళ్లకు దెబ్బలు తగిలినట్టు చెప్పి వైద్యాలయానికి తీసుకుని వచ్చి జాయిన్ చేసి వెళ్లిపోయాడు. విధులు నిర్వహిస్తున్న వైద్యులు అతనికి చికిత్స అందిస్తున్న సమయంలో తెల్లవారు జామున నాలుగు గంటల సమయంలో ఆ వ్యక్తి ఆస్పత్రిలో రెండో అంతస్తు ఎక్కి వీరంగం సృష్టించాడు. వెంటనే ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది అతన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించగా వారిపై రాళ్లతో దాడి చేసి వార్డుల్లోకి వెళ్లి రోగులను భయాందోళనకు గురిచేశాడు. దీంతో వైద్యులు పట్టణ పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ సత్యనారాయణ తన సిబ్బందితో వైద్యాలయానికి వచ్చి సెక్యూరిటీ సిబ్బందితో కలిసి సైకోను అదుపులోకి తీసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం అతనిని అంబులెన్స్‌లో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అప్పటికే ఆ వ్యక్తి వైద్యాలయంలో రెండు కిటికీల గ్లాసులను పగలగొట్టాడు.

నాణ్యమైన సేవలే లక్ష్యం

- సమస్యలుంటే 1902 టోల్‌ఫ్రీ నంబరుకు ఫిర్యాదు
- 'జగనన్నకు చెబుదాం' సద్వినియోగం చేసుకోవాలి
- 19 నెలల్లో సెల్ టవర్ల నిర్మాణం పూర్తి
- కలెక్టర్ సుమిత్‌కుమార్

పాడేరు రూరల్: ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో విలేకరులతో మాట్లాడారు. స్పందన కార్యక్రమంలో మార్పులు చేర్పులు చేసినట్టు తెలిపారు. 1902 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు సమస్యను నమోదు చేసి సంబంధిత శాఖల అధికారులకు సమాచారం అందిస్తారన్నారు. రంపచోడవరంలో ప్రతీ సోమవారం, చింతూరులో బుధవారం, పాడేరులో శుక్రవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. స్పందనలో 1300కు పైగా అర్జీలు అందాయని పేర్కొన్నారు. వాటిలో ప్రధానంగా భూ సమస్యలు, రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి సమస్యలు ఉన్నాయన్నారు. నిర్దిష్టమైన గడువులోగా సమస్యల పరిష్కారానికి జిల్లా, మండలస్థాయి అధికారులను విచారణ అధికారులుగా నియమించడం జరిగిందన్నారు. సమస్యలు పరిష్కరించని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని స్పష్టం చేశారు. జననీ ధ్రువీకరణ పత్రాలు, పిల్లలకు అధార్ నమోదును డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు బాధ్యతగా చేపట్టాలని సూచించామన్నారు. జిల్లాలోని 24వేల మంది పిల్లలకు ఆధార్ కార్డులు జారీ చేయాల్సి ఉందన్నారు. జిల్లాలో ఇటీవల రూ.22కోట్ల పనులకు సంబంధించి సొమ్మును విడుదల చేసినట్టు తెలిపారు. జిల్లాలో ప్రధానంగా సమాచార వ్యవస్థకు మెరుగు పర్చేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 2327 సెల్ టవర్లు మంజూరు అయ్యాయన్నారు. వీటిలో ఎయిర్‌టెల్ 137, రిలయన్స్ 608, బీఎస్ఎన్ఎల్ 1580 నిర్మిస్తున్నామని చెప్పారు. సెల్ టవర్ల నిర్మాణం 19 నెలల్లో పూర్తిచేస్తామన్నారు. గంజాయి సాగు నిర్మూలనలో భాగంగా పదివేల ఎకరాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించినట్టు చెప్పారు. దీనిలో భాగంగా వాటికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసి మండలాలావారీగా ప్రణాళికపరంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఏజెన్సీ వ్యాప్తంగా మరో 13వేల ఎకరాల్లో కాఫీ విస్తరణకు చర్యలు చేపట్టామన్నారు. హైవే నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. ప్రతి పీహెచ్‌సీకు ఇద్దరేసి వైద్యులు ఉండాలనే నిబంధనను తప్పనిసరి చేశామన్నారు. జిల్లా 62 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 128 మంది వైద్యులు ఉన్నారన్నారు. గత ఆరు నెలల వ్యవధిలో 75మంది వైద్యులను నియమించినట్టు చెప్పారు. జిల్లాలో 13,140 ఇళ్లు మంజూరు కాగా వివిధ దశల్లో నిర్మాణాలు ఉన్నాయన్నారు. వీటికి సంబంధించి రూ.28 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశామన్నారు. ఏమైనా సమస్యలు తలెత్తితే 1902 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కలెక్టర్ సూచించారు.

ఫెయిలైన విద్యార్థులకు శిక్షణ



కేజీబీవీలో ప్రత్యేక తరగతులను పర్యవేక్షిస్తున్న అనకాపల్లి డీఈవో వెంకట లక్ష్మమ్మ

- ఉత్తీర్ణతే లక్ష్యంగా కేజీబీవీల్లో ప్రత్యేక తరగతులు
- కె.కోటపాడు, మునగపాక, నర్సీపట్నం, వి.మాడుగులలో నిర్వహణ

కె.కోటపాడు: ఒకసారి ఇంటర్‌లో ఫెయిలైన విద్యార్థులు మరలా ఉత్తీర్ణత సాధించాలంటే ఏం చేయాలో పాలుపోదు. పాస్ కాలేదని బాధతోపాటు సప్లిమెంటరీ పరీక్షలకు ప్రైవేటు ట్యూషన్ పెట్టించుకునే స్థోమత లేక నిరుత్సాహంతో చదువు ఆపేస్తుంటారు. ఈ నేపథ్యంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఇటువంటి వారి ఉత్తీర్ణత సాధనకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 24వ తేదీ నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో ఇంటర్మీడియట్‌లో ఈ ఏడాది ఉత్తీర్ణత సాధించని వారికి ప్రత్యేకంగా ఉపాధ్యాయినులతో రోజూ సబ్జెక్టులవారీగా బోధిస్తున్నారు. కె.కోటపాడు మండలం గొల్లలపాలెం కేజీబీవీలో గొల్లలపాలెం, రోలుగుంట, గొలుగొండ, రాంబిల్లి, చోడవరం కేజీబీవీల్లో ఉత్తీర్ణత సాధించని 73 మంది విద్యార్థినులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో వి.మాడుగుల కేజీబీవీలో 105 మంది, నర్సీపట్నం కేజీబీవీలో 112 మంది, మునగపాక కేజీబీవీలో 118 మంది విద్యార్థినుల ఉత్తీర్ణత సాధన లక్ష్యంగా కృషి చేస్తున్నారు.

తరగతుల నిర్వహణ ఇలా :

- కేజీబీవీల్లో ప్రత్యేక తరగతులను ఉదయం నుంచి రాత్రి వరకూ నిర్వహిస్తున్నారు.
- ఉదయం 5.30 నిమిషాలకు విద్యార్థినులు పరీక్షల్లో మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు యోగా శిక్షణ ఇప్పిస్తున్నారు.
- ఉదయం 7 నుంచి 9 గంటల వరకు స్టడీ అవర్ నిర్వహిస్తున్నారు.
- 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఏయే సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులు కాలేదో వాటిపై బోధన
- ప్రతీ రాత్రి రెండు సబ్జెక్టులపై మోడల్ పరీక్షల నిర్వహణ
- విద్యార్థులకు చదువులతోపాటు పౌష్టిక ఆహారాన్ని అందిస్తున్నారు.
- సప్లిమెంటరీ పరీక్షల్లో ప్రతి విద్యార్థినీ ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయినులు కృషి చేస్తున్నారు.



కేజీబీవీలో సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థినులు

20 వరకూ తరగతులు..



సప్లిమెంటరీ పరీక్షలను రాసే కేజీబీవీ విద్యార్థినులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నాం. చదువులోపాటు మంచి పౌష్టికాహారం అందిస్తున్నాం. పరీక్షలంటే ఒత్తిడి, భయం పోయేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న ప్రతి విద్యార్థినిపైనా పర్యవేక్షణ ఉంచుతూ బోధిస్తున్నాం. ఈ నెల 20వ తేదీ వరకూ ఈ తరగతులు నిర్వహించనున్నాం.

– బి.చిన్నమ్మలు, ప్రిన్సిపాల్, కేజీబీవీ, గొల్లలపాలెం

శాంతిభద్రతల పరిరక్షణపై ఎస్పీ సమీక్ష



సమీక్షిస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

సాక్షి,పాడేరు: జిల్లాలోని శాంతి భద్రతల పరిరక్షణపై ఎస్పీ తుహిన్ సిన్హా అధికారులతో బుధవారం సాయంత్రం సమీక్షించారు. పాడేరు, చింతపల్లి, రంపచోడవరం, చింతూరు పోలీసు సబ్‌డివిజన్ల ఏఎస్పీలతో నెల వారీ సమీక్ష నిర్వహించారు. ఆయా సబ్‌డివిజన్ల పరిధిలోని పోలీసు స్టేషన్లలో నమోదైన కేసులపై సమగ్రంగా సమీక్షించారు.


శ్రీలక్ష్మీ మహా యజ్ఞం పోస్టర్ ఆవిష్కరణ

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): విజయవాడలో ఈ నెల 12 నుంచి 17 వరకు నిర్వహించనున్న అష్టోత్తర శతకుండాత్మక చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞంకు సంబంధించిన పోస్టర్‌ను దేవదాయ శాఖ సహాయ కమిషనర్, కనకమహాలక్ష్మి ఆలయ ఈవో కె.శిరీష ఆవిష్కరించారు. బుధవారం కనకమహాలక్ష్మి ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, దేవదాయ శాఖ నిర్వహణలో విశ్వశాంతిని కాంక్షిస్తూ ఈ మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 12వ తేదీ ఉదయం 8.30 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీలక్ష్మీ మహా యజ్ఞం ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. 13న ద్వారకా తిరుమలలో వేంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం, 14న అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి కల్యాణ మహోత్సవం, 15న శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి లీలా కల్యాణ మహోత్సవం, 16న సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి కల్యాణ మహోత్సవం జరుగుతాయన్నారు. 17న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిచే మహా పూర్ణాహుతి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు, ధర్మకర్త ఎన్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం దేవస్థాన అర్చకులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దేవదాయ శాఖ సహాయ కమిషనర్ శిరీష

రైల్వే డీఎస్పీగా మోహనరావు బాధ్యతల స్వీకరణ



బి.మోహనరావు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్(డీఎస్ఆర్‌పీ)గా బి.మోహనరావు బుధవారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లోని గవర్నమెంట్ రైల్వే పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇప్పటి వరకు విజయనగరం జిల్లా బొబ్బిలి సబ్ డివిజనల్ పోలీస్‌ఆఫీసర్(ఎస్‌డీపీవో)గా విధులు నిర్వర్తించారు. సుమారు 20 నెలల పాటు రాజమండ్రి డీఎస్ఆర్‌పీ బి.వి.ఎస్.నాగేశ్వరరావు విశాఖపట్నం ఇన్‌చార్జి డీఎస్ఆర్‌పీగా వ్యవహరించారు. ప్రయాణికుల భద్రత, రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తామని ఈ సందర్భంగా మోహనరావు తెలిపారు. వీఐపీల భద్రత, దొంగతనాల నివారణ, నేరాలు, అవాంఛనీయ సంఘటనలు నివారిస్తూ, పెట్రోలింగ్ చేయాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా గంజాయి రవాణాపై కఠిన నిఘా ఉంచాలని, ఆర్పీఎఫ్, స్థానిక పోలీసులు, ఇంటిలిజెన్స్, ఎస్ఈబీలతో సమన్వయంతో పని చేయాలన్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీస్ సీఐ పి.కోటేశ్వరరావు, సబ్ ఇన్‌స్పెక్టర్‌లు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

ఐదుగురి అరెస్టు

సీలేరు: స్థానిక పోలీసుస్టేషన్ పరిధిలో అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులను పట్టుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మారెమ్మ ఆలయం వద్ద ఒడిశా నుంచి ఇద్దరు వస్తున్న బైక్‌ను తనిఖీ చేయగా గంజాయి బయటపడిందన్నారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని విచారించినట్టు చెప్పారు. వారు తెలిపిన సమాచారం మేరకు పక్కనే ఉన్న టేకు తోటలో పరిశీలించగా గంజాయితో మరో ముగ్గురు పట్టుబడ్డారన్నారు. వీరినుంచి 43 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన ఐదుగురిలో సీలేరుకు చెందిన షేక్ అహ్మద్‌అలీ, బుద్ద లోకేష్, పాల్వంచ ప్రకాష్, ప్రశాంత్, జి.మాడుగులకు చెందిన శెట్టి విశ్వనాథ్ ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

పనులు పూర్తి చేయండి

మాకవరపాలెం: నాడు–నేడు పనులను వేగవంతం చేయాలని అనకాపల్లి డీఈవో వెంకటలక్ష్మమ్మ సూచించారు. మండలంలోని గిడుతూరు ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న తరగతి గదులను బుధవారం పరిశీలించారు. పాఠశాలల ప్రారంభం నాటికి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు చేరిన పాఠ్య పుస్తకాలను కూడా పరిశీలించారు. పుస్తకాలు పూర్తిస్థాయిలో రాగానే ఆయా పాఠశాలలకు పంపిణీ చేయాలని ఎంఈవో నరేష్‌కు సూచించారు.

• నందీశ్వరుడి నిజరూపంలా..



స్థానిక ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఓ ఎద్దు భక్తులను అలరించింది. ఆలయ ప్రాంగణంలోని శివపార్వతుల భారీ విగ్రహాల వద్ద నందీశ్వరుడి విగ్రహం లేదు. బుధవారం ఉదయం ఓ ఎద్దు ఆలయంలో విగ్రహాల ఎదుట చాలా సేపు సేదతీరడం నందీశ్వరుని నిజరూపాన్ని తలపించింది.

- సాక్షి, పాడేరు

రెండు వాటర్ ప్లాంట్లు సీజ్

మాకవరపాలెం: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న రెండు వాటర్ ప్లాంట్లను జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ సీజ్ చేశారు. మండలంలోని శెట్టిపాలెంలో ఉన్న కామధేను వాటర్ ప్లాంట్, పైడపాలలో ఉన్న దుర్గా వాటర్ ప్లాంట్లను ఆయన బుధవారం తనిఖీ చేశారు. నిబంధనలు పాటించకపోవడంతో పాటు ఐఎస్ఐ మార్క్ లేకపోవడాన్ని గుర్తించారు. ఈ రెండు ప్లాంట్లను రెవెన్యూ అధికారుల సమక్షంలో సీజ్ చేశారు. నిబంధనలు పాటించకుండా ఎక్కడ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసినా చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట ఆర్ఐ జెట్టి, వీఆర్వోలు సాంభశివరావు, ప్రసాద్ ఉన్నారు.

పనిచేయకపోతే సెలవుపై వెళ్లండి

- ఆధార్ అప్‌డేట్‌పై ఇంత నిర్లక్ష్యమా..
- సచివాలయ ఉద్యోగుల పనితీరు మారాలి
- గ్రామ సచివాలయ వార్డు అనకాపల్లి జిల్లా అధికారి మంజులావాణి



మాట్లాడుతున్న గ్రామ సచివాలయ వార్డు అనకాపల్లి జిల్లా అధికారి మంజులావాణి

నాతవరం : ప్రభుత్వం చెప్పిన పనులు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే సచివాలయ ఉద్యోగులు సెలవు పెట్టి ఇంటికి వెళ్లాలని గ్రామ సచివాలయ వార్డు అనకాపల్లి జిల్లా అధికారి మంజులావాణి అన్నారు. ఆమె బుధవారం నాతవరం మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు, చిన్నారుల ఆధార్ నంబర్లు డేటా నమోదు సచివాలయాల్లో చాలా దారుణంగా ఉందన్నారు. ఈ పని చేయాలని ప్రభుత్వం చెప్పి నెలలు గడుస్తున్నా సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు నిర్లక్ష్యం చేయడం ఏంటని అన్నారు. ప్రభుత్వం అప్పగించిన ఆధార్ డేటా అప్‌లోడ్ చేసే వరకు మండలంలో పని చేసే సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులకు ఈనెల జీతాలు నిలుపుదల చేయాలని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావును ఆదేశించారు. ఎం.బి.పట్నం సచివాలయంలో పని చేస్తున్న మహిళా పోలీసు పనితీరు అధ్వానంగా ఉందని సెలవు పెట్టి వెళ్లి పోవాలని సూచించారు.

ఓటీఎస్ డబ్బులు వెంటనే జమ చేయండి...

గుమ్మడిగొండ ఎం.బెన్నవరం, మన్యపురట్ల, చెర్లోపాలెం, గన్నవరం ఎం.బి.పట్నం నాతవరం, పెదగొలుగొండపేట, గునుపూడి, సరుగుడు, చమ్మచింత సచివాలయాల పరిధిలో ఓటీఎస్ డబ్బులు ప్రభుత్వానికి చెల్లించకుండా తమ వద్దే ఉంచుకోవడంపై జిల్లా అధికారి మంజులావాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నాటికి మీ వద్ద ఉన్న డబ్బులు పూర్తిగా ప్రభుత్వ అకౌంటులో జమ చేయకపోతే మిమ్మల్ని సస్పెండ్ చేయడానికి కలెక్టరు దృష్టికి తీసుకెళ్తానని హెచ్చరించారు.

నాతవరం మండలంలోనే అధికం...

జిల్లావ్యాప్తంగా 24 మండలాల్లో ఓటీఎస్ కోసం వసూలు చేసిన డబ్బులు సచివాలయాల్లో రీ సర్వే సెస్ ద్వారా వచ్చిన డబ్బులు రూ.2 కోట్లకు పైగా కట్టవలసి ఉందని, ఈ డబ్బులు అధికంగా నాతవరం మండలంలోనే కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు జమ చేయాల్సిందని మంజులావాణి తెలిపారు. డబ్బులు పూర్తిగా రికవరీ చేసే బాధ్యత ఎంపీడీవో వహించాలన్నారు. ప్రభుత్వ సొమ్ము ఒక్క పైసా సొంతానికి వాడుకున్నా ఉద్యోగం పోవడం ఖాయమన్నారు. సచివాలయ ఉద్యోగుల పని తీరులో పూర్తిగా మార్పు రావాలన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీరు వ్యవస్థ ఏర్పాటు ఉద్దేశ్యాన్ని అపహాస్యం చేయొద్దన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డీఎల్‌డీవో ఉదయశ్రీ, ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, పంచాయతీ విస్తరణాధికారి ప్రేమలీల, ఏఎస్‌వో ఉలబాల రాజుబాబు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.